రాజకీయ పార్టీగా 'విజయ్ మక్కల్ ఇయ్యక్కం'

- అధ్యక్షుడిగా విజయ్!



ప్యారీస్, జనవరి 27: తమిళ హీరో విజయ్ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటివరకు వున్న విజయ్ మక్కల్ ఇయ్యక్కం అభిమాన సంఘాన్నే ఆయన రాజకీయ పార్టీగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాజకీయ పార్టీ గుర్తింపునకు కేంద్ర ఎన్నికల సంఘం కోసం దరఖాస్తు చేయనున్నట్లు సమాచారం. గురువారం స్థానిక పనైయూరులో విజయ్ మక్కల్ ఇయ్యక్కం ప్రధాన కార్యాలయంలో ముఖ్య నిర్వాహకుల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఇంకా పేరు పెట్టని రాజకీయ పార్టీకి విజయ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మక్కల్ ఇయ్యక్కం పోటీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే విజయ్ తన అభిమాన సంఘాన్ని మక్కల్ ఇయ్యక్కంగా మార్చి పలు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. తమిళ రాజకీయాల్లో విజయ్ ప్రవేశిస్తారని, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నప్పటికీ దీనిపై విజయ్ మాత్రం ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ్ మక్కల్ ఇయ్యక్కంకు చెందిన నేతలు పలు ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించారు. తమిళనాడులో ఉన్న పలు రాజకీయ పార్టీల తరహాలోనే విజయ్ ప్రారంభించనున్న పార్టీలో కూడా 'తమిళనాడు' అనే పేరు ఉంటుందని, భారత ఎన్నికల సంఘం పార్టీ పేరు రిజిస్ట్రేషన్ అయ్యాక పార్లమెంట్ ఎన్నికల పనులను విజయ్ అధికారికంగా నిర్వాహకులకు అప్పగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆ పర్యటన వ్యక్తిగతమా?

- మోదీ శ్రీరంగం, రామేశ్వరం పర్యటనల ఖర్చు ఎంత
- ఆర్టీఐ సమాచారం కోరిన న్యాయవాది



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ వేడుకల సందర్భంగా ఈనెల 19 నుంచి 21 దాకా రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోదీ జరిపిన పర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలు కోరుతూ మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది దురైస్వామి ఆర్టీఐ చట్టం ప్రకారం దరఖాస్తును సమర్పించారు. ఈనెల 19 సాయంత్రం చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా యువజన క్రీడల ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. తదుపరి రెండు రోజులు శ్రీరంగం, రామేశ్వరం ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈనెల 21 ఉదయం అరిచ్చలై మునై (సేతు బంధన తీర్థాన్ని) కూడా సందర్శించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా శ్రీరంగం ఆలయం, రామేశ్వరం ఆలయ ప్రాంగణాల్లో భక్తులను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ దర్శనానికి అనుమతించకుండా, ఆలయాల చుట్టూ ఎవరినీ సంచరించకుండా కట్టుదిట్టం చేశారు. ఈ ఏర్పాట్లకు, మోదీ ప్రయాణించిన విమాన, హెలికాప్టర్ పయనాలకు పెట్టిన ఖర్చుల వివరాలు? ఆ ఖర్చులను కేంద్రప్రభుత్వం భరిస్తుందా? లేక ప్రధాని మోదీ భరిస్తారా? స్పష్టం చేస్తూ సమగ్రమైన వివరాలను తనకు సమర్పించాలని న్యాయవాది దురైస్వామి కోరారు. ఆయన అడిగిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి...

- ప్రధాని పర్యటన వ్యక్తిగతమా?.. అధికారికమా? ఆయన ప్రయాణించిన విమానం, హెలికాప్టర్, కార్లు తదితర వాహనాల ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరించిందా?
- వ్యక్తిగత పర్యటన అయితే రవాణా ఖర్చులను ప్రధాని నుంచివసూలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందా?
- వ్యక్తిగత పర్యటన అయితే ఏ చార్జీలు చెల్లించకుండా ప్రభుత్వ వాహనాలను ఏ నియమ, నిబంధనల ప్రకారం ప్రధాని ఉపయోగించారు?
- సామాన్య భక్తులు ఆలయాలకు వెళ్లేందుకు ఇదే విధంగా ప్రభుత్వ వాహనాలను ఉపయోగించే అవకాశం ఉందా?
- ప్రధానమంత్రి రవాణా ఖర్చుల వివరాలను సమగ్రంగా తెలియజేస్తారా?.



విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతున్న స్టాలిన్

కొత్త పెట్టుబడుల కోసం స్టాలిన్ విదేశీయానం

- స్పెయిన్, ఇంగ్లండు, ఆస్ట్రేలియాల్లో పర్యటన
- పారిశ్రామికవేత్తలతో భేటీ

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక స్థితిని వచ్చే ఆరేళ్లలోగా వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి చేర్చాలన్న సంకల్పంతో కొత్త పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా పెట్టుబడుల సమీకరణ కోసం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విదేశీ పర్యటనకు బయలుదేరారు. శనివారం రాత్రి 9.40 గంటలకు మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానంలో స్పెయిన్ పర్యటనలో భాగంగా దుబాయ్‌కి బయలుదేరారు. ఈ నెల ప్రారంభంలో చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో అంచనాలకు మించి రూ.6.64 లక్షల కోట్ల పెట్టుబడులతో కొత్త పరిశ్రమల స్థాపన, ప్రస్తుతమున్న పరిశ్రమలలో వాణిజ్య కలాపాల విస్తరణ, ఉత్పత్తుల పెంపు చేసే దిశగా దేశవిదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ మేరకు రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటయితే సుమారు 27 లక్షలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న విషయం విదితమే. అంతర్జాతీయ స్థాయిలో విజయవంతంగా ముగిసిన ఆ మహానాడుకు అనివార్య కారణాల వల్ల స్పెయిన్, ఇంగ్లండు, ఆస్ట్రేలియా దేశాల పారిశ్రామికవేత్తలు, బహుళజాతి సంస్థల ప్రతినిధులు హాజరుకాలేకపోయారు. దీంతో ఆ పారిశ్రామికవేత్తలను స్వయంగా కలుసుకుని, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని, పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించేందుకు స్టాలిన్ తన విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. తొలుత దుబాయ్‌కి వెళ్లే స్టాలిన్ అక్కడి నుంచి స్వీడన్ చేరుకుని ఆ తర్వాత స్పెయిన్‌కు పయనమవుతారు. స్పెయిన్‌లోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. అటు పిమ్మట ఇంగ్లండు, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. సుమారు పది రోజులపాటు ఆయన విదేశాల్లో పర్యటించి పెట్టుబడులను భారీ స్థాయిలో సేకరించనున్నారు. స్టాలిన్‌తోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి మురుగానందం, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్ కూడా బయలుదేరి వెళ్ళారు. స్టాలిన్ తన విదేశీ పర్యటనను ముగించుకుని ఫిబ్రవరి 7న చెన్నైకి తిరిగిరానున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా విదేశీ పర్యటన చేపట్టినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గతంలో ఒక సారి విదేశీ పర్యటన చేపట్టి రూ.7,749 కోట్ల పెట్టుబడులు సేకరించామన్నారు. దేశంలోనే పెట్టుబడులు పెట్టేందుకు తమిళనాడులో అన్ని వసతులున్నాయని తెలిపేలా తన పర్యటన ఉందన్నారు. స్పెయిన్ సహా యూరోపియన్ దేశాల్లో 8 రోజుల పర్యటించనున్నట్లు సీఎం తెలిపారు.

పాఠశాల విద్యాశాఖలో పెను మార్పులు

- జీవో జారీ చేసిన కార్యదర్శి
- స్వాగతిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

అడయార్, జనవరి 27: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో పెను మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి కుమరకృపాకరన్ జీవోను జారీ చేశారు. ఈ జీవోలో పేర్కొన్న అంశాల మేరకు... పాఠశాలల్లోని ఖాళీలు, బదిలీలు, కొత్త నియామకాల వంటి వివరాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా బహిర్గతం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర విద్యాశాఖను ప్రక్షాళన చేశారు. ఆ శాఖకు యువ ఐఏఎస్ అధికారులను నియమించడమే కాకుండా, పాఠశాల విద్యా మంత్రిగా విద్యావంతుడు, యువకుడైన అన్బిల్ మహేష్‌ను నియమించారు. అదేసమయంలో విద్యాశాఖలో చేపట్టాల్సిన మార్పులపై సీఎం ఎప్పటికపుడు ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా కుమర కృపాకరన్‌ను నియమించారు. ఈయన బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ శాఖను మరింత పారదర్శకంగా చేసే అంశంపై దృష్టిసారించారు. అలాగే, విద్యాశాఖకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఎవరైనా తన చాంబర్‌కు రావొచ్చని ప్రకటించారు. దీంతో అనేక మంది ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు నిరంతరం ఆయనను కలుస్తూ విద్యాశాఖలో తీసుకురావాల్సిన మార్పులు చేర్పులపై చర్చిస్తూ వచ్చారు. వీటిలో మంచి విషయాలను అమలు చేసేందుకు ఆయన మొగ్గు చూపారు.

ముఖ్యాంశాలను పరిశీలిస్తే...

పాఠశాల విద్యాశాఖ కింద పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ మున్సిపాలిటీ, కార్పొరేషన్ హైస్కూల్, హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరికీ సాధారణ బదిలీ సౌకర్యం కల్పించేందుకు పాటించాల్సిన నియమ నిబంధనలు విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖ కింద ఉండే పాఠశాలల్లో డిగ్రీ టీచర్ల ఖాళీ పోస్టుల భర్తీకి అనుసరించాల్సిన విధానాన్ని బహిర్గతం చేశారు. అన్ని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీని టీచర్స్ రిక్రూట్మెంట్ బోర్డు (టీఆర్‌బీ) ద్వారానే ఎంపిక చేయాలని షరతు విధించారు. అదేవిధంగా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పారదర్శకంగా బహిర్గతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలను జూన్ 30వ తేదీలోపు పూర్తి చేయాలని, ఖాళీల భర్తీలో ఏదేని ఆక్షేపణ ఉంటే జూన్ 15వ తేదీలో తమ దృష్టికి తీసుకుని రావాలని ఇలా విద్యాశాఖలో తీసుకునే ప్రతి నిర్ణయం, విధానం నిజాయితీగా, పారదర్శకంగా ఉండాలని ఆ జీవోలో పేర్కొన్నారు. దీన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యావేత్తలు కూడా స్వాగతిస్తున్నారు.

వైభవంగా శివసుబ్రమణ్యస్వామి ఆలయ రథోత్సవం

- రథాన్ని లాగిన మహిళలు



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి కుమారసామిపేటలో సుప్రసిద్ధ శివసుబ్రమణ్యస్వామి ఆలయ తైపూస రథోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో మహిళా భక్తులు మాత్రమే రథం మోకుతాళ్లను లాగడం విశేషం. ఈ ఆలయంలో తైపూస ఉత్సవాలు ఈ నెల 21న ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. గురువారం ఉదయం మహిళా భక్తులు క్షీరకలశాలను శిరస్సుపై ఉంచుకుని నగర రహదారులలో ఊరేగింపును జరిపారు. ఆ తర్వాత ఆలయానికి క్షీరకలశాలను తీసుకెళ్ళారు. ఆ క్షీరంతో స్వామివారికి మహా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఆ సందర్భంగా వల్లీదేవసేన సమేత శివసుబ్రమణ్యస్వామి సర్వాలంకరణ శోభితులై రథంపై కొలువుదీరారు. ఆ తర్వాత మహిళా భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్ళను పట్టుకుని లాగుతూ వెళ్లారు. రహదారికి ఇరువైపులా నిలిచిన భక్తులు 'మురుగా.. మురుగా' అంటూ చిల్లర నాణేలను, పువ్వులను చల్లారు. దారి పొడవునా భక్తులు రథారూఢులైన స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత రథం ఆలయం వద్దనున్న రథ మండప ప్రాంతానికి చేరుకుంది. ఈ వేడుకలకు ఆలయ నిర్వాహకులు, పోలీసులు భక్తులకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

పట్టభద్రులు పఠనాసక్తిని పెంచుకోవాలి

- జిప్మర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్
- ఘనంగా ఎంజీఆర్ వైద్యవిశ్వవిద్యాలయ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తామెంచుకున్న రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తుండటం వల్ల పట్టభద్రులు పఠనాసక్తిని పెంచుకోవాలని పుదుచ్చేరి జిప్మర్ వైద్యకళాశాల డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గిండిలోని తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం 36వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. వీసీ కె.నారాయణసామి స్వాగతోపన్యాసం చేశారు. ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి 6753 మంది విద్యార్థులకు, దంత వైద్య కోర్సులకు సంబంధించి 1944 మందికి పట్టాలను ప్రదానం చేశారు. వివిధ కోర్సులలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై అత్యంత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన 179 మందికి స్వర్ణ, రజత పతకాలు అందజేశారు. వీరిలో సింధు అనే విద్యార్థిని పది పతకాలను గెల్చుకుంది. మహమ్మద్ యాషిన్ అనే విద్యార్థి తొమ్మిది పతకాలను సాధించాడు. ఈ స్నాతకోత్సవంలో రాకేష్ అగర్వాల్ మాట్లాడుతూ... విద్యతోనే సమాజంలో మార్పులు తీసుకురాగలుగుతారని దక్షిణా ఆఫ్రికా దివంగత మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెబుతుండేవారని, ఆ విధంగానే విద్యార్థులు కూడా తాము ఎంచుకున్న రంగాలలో నిష్ణాతులుగా మారి సమాజంలో మంచి మార్పులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

కోవై, సేలం పార్టీ నేతలతో ఉదయనిధి భేటీ

- నియోజకవర్గాల్లో తాజా పరిస్థితులపై సమీక్ష



కోయంబత్తూరు, సేలం లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమావేశమైన కమిటీ

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై సమీక్షించే దిశగా డీఎంకే ఎన్నిలక సమన్వయ కమిటీ సమావేశం అన్నా అరివాలయంలో శనివారం ఉదయం జరిగింది. డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు, మంత్రి ఉదయనిధి ఆ రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, ఎన్నికల ఇన్‌చార్జులు, జిల్లా శాఖల నేతలతో చర్చించారు. లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షాలతో సీట్ల కేటాయింపులపై చర్చించడానికి కమిటీ, ఎన్నికల మేనిఫెస్టో తయారీకి మరో కమిటీ, ఎన్నికల సమన్వయ కమిటీలను డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే డీఎంకే మహిళా విభాగ అధ్యక్షురాలు ఎంపీ కనిమొళి నాయకత్వంలోని ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ రెండు విడతల చర్చలు కూడా నిర్వహించింది. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు, సేలం లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రస్తుతం పార్టీకి గల ప్రజాదరణపై మంత్రి ఉదయనిధి కమిటీ సభ్యులు, స్థానిక నేతల వద్ద అడిగి తెలుసుకున్నారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, తంగం తెన్నరసు, ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు. రెండు జిల్లాలకు చెందిన జిల్లా శాఖ నాయకులతో ఈ కమిటీ సభ్యులు వేర్వేరుగా సమావేశమై పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం నీలగిరి, తిరుప్పూరు లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, జిల్లా శాఖల నేతలతో ఎన్నికల సమన్వయకమిటీ సభ్యులు సమావేశమయ్యారు.

భవతారిణికి కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు
- భోరున విలపించిన భారతీరాజా



కుమార్తె పార్థివదేహాన్ని చివరిసారి చూస్తున్న ఇళయరాజా

అడయార్, జనవరి 27: కాలేయ క్యాన్సర్ కారణంగా మృతి చెందిన సినీ నేపథ్య గాయని, సంగీత దర్శకురాలు భవతారిణికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె అంత్యక్రియలను శనివారం పూర్తి చేశారు. తేని జిల్లా పన్నైపురంలోని సంగీత దర్శకుడు ఇళయరాజా ఫామ్‌హౌస్‌లో ఈ అంత్యక్రియలను నిర్వహించారు. గురువారం సాయంత్రం శ్రీలంకలో మృతి చెందిన ఆమె పార్థివదేహాన్ని విమానంలో చెన్నైకి శుక్రవారం తీసుకొచ్చి, సినీ ప్రముఖుల సందర్శనార్థం రాత్రి వరకు టి.నగర్, మురుగేశన్ వీధిలో ఉన్న ఇళయరాజా నివాసంలో ఉంచారు. రాత్రి 10 గంటలకుపైగా అంబులెన్స్‌తో భవతారిణి మృతదేహాన్ని తేని జిల్లా పన్నైపురంకు తరలించారు. అక్కడ శనివారం మధ్యాహ్నం వరకు ప్రజల సందర్శనార్థం ఉంచారు. భవతారిణి మృతదేహాన్ని ఇళయరాజా, కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా, వెంకట్ ప్రభు, ప్రేమ్‌జీ, మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం, తేని ఎంపీ రవీంద్రనాథ్, నటులు అరవింద్, కృష్ణ, డ్రమ్స్ శివమణి తదితరులు కడసారి చూసి కన్నీటి నివాళి అర్పించారు. సీనియర్ దర్శకుడు భారతీరాజా.. భవతారిణి పార్థివదేహం వద్ద భోరున విలపించడం ప్రతి ఒక్కరినీ కంట తడిపెట్టించింది. ఆ తర్వాత ఆయన తన స్నేహితుడు ఇళయరాజాను ఓదార్చారు. పిమ్మట ఇళయరాజాకు చెందిన ఫామ్‌హౌస్‌లో ఆయన తల్లి చిన్నతాయి, సతీమణి జీవా సమాధుల మధ్య కుమార్తె భవతారిణి మృతదేహాన్ని ఖననం చేసి, అంత్యక్రియలు పూర్తి చేశారు.

సమాచార దృశ్యి

మద్యంమత్తులో గలభా సృష్టించిన విమాన ప్రయాణికుడి అరెస్టు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుండి వస్తున్న విమానంలో మద్యం మత్తులో గలభా సృష్టించిన ప్రయాణికుడిని చెన్నై ఎయిర్‌పోర్ట్ పోలీసులు అరెస్టు చేశారు.దుబాయ్ నుండి 164 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం చెన్నై విమానాశ్రయంలో దిగటానికి అరగంట ముందుగా తిరువారూరు జిల్లాకు చెందిన మహమ్మద్ అజారుద్దీన్ (25) పీకలదాకా మద్యం సేవించి తోటి ప్రయాణికులతో గొడవకు దిగాడు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన ఎయిర్‌హోస్టెస్ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.ఈ విషయాన్ని పైలెట్ చెన్నై విమానాశ్రయం కంట్రోల్ రూమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం వేకువజామున 2.30 గంటలకు ఆ విమానం ల్యాండ్ కాగానే భద్రతా సిబ్బంది అజారుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నేడు త్యాగరాజ ఆరాధన

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్థానిక టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో 'శ్రీ త్యాగరాజ ఆరాధన' జరగనుంది. కమలి కుమార్ బృందం 'పంచరత్న కీర్తనల ఆలాపన చేయనుంది. సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసురాలు పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి గౌరవ అతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తిరువయ్యారులో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్యారీస్, జనవరి 27: కర్ణాటక సంగీత మమ్మూర్తులలో ఒకరైన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు తంజావూరు జిల్లా తిరువయ్యారులో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండో రోజైన శనివారం ఉదయం 9 గంటలకు తిరువయ్యారు సంగీత కళాశాల విద్యార్థులు నాదస్వరంతో స్వామి వారికి నీరాజనం పలికారు. తిరువయ్యారు కావేరీ నదీతీరంలో త్యాగరాయ స్వామి ఆలయంలో యేటా జనవరిలో ఆరాధనోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. త్యాగబ్రహ్మ మహోత్సవ ఆధ్వర్యంలో 177వ ఆరాధనోత్సవాలను సభ అధ్యక్షుడు జీకే వాసన్ ప్రారంభించారు. ఈ నెల 30వతేదీవరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11గంటలవరకు సంగీత కళాకారుల కచ్చేరి ఉంటుంది. ఉత్సవాల్లో ప్రధానాంశమైన పంచరత్న కీర్తనల కార్యక్రమంలో 500 మందికిపైగా సంగీత విద్వాంసులు, కళాకారులు పాల్గొని పంచరత్న కీర్తనలు ఆలపిస్తారు.

రాయపేటలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, జనవరి 27: మెట్రోరైలు పనుల కారణంగా రాయపేట ప్రాంతంలో ఈ నెల 31వ తేది ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

తిరువిక రోడ్డు నుంచి బటుల్లాస్ రోడ్డు వరకు వన్‌వే.

క్లాక్ టవర్ నుంచి సత్యం థియేటర్ మీదుగా వెళ్లే వాహనాలు బటుల్లాస్ రోడ్డు మీదుగా వెళ్లి, అన్నాసాలై, తిరువిక రోడ్డు మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

థౌజండ్ లైట్స్, అన్నాసాలై నుంచి సత్యం థియేటర్ మీదుగా వచ్చే వాహనాలు తిరువికరోడ్డు - వైట్స్ రోడ్డు మీదుగా వెళ్లొచ్చు.

రూ.9,482 కోట్ల ఆదాయం

ఐసిఎఫ్, జనవరి 27: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9,482 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. గత ఏడాది కంటే 5 శాతం ఎక్కువ అని తెలిపింది. అలాగే, ఇప్పటివరకు 32.24 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరిగిందని పేర్కొంది.

కశ్మీర్ కోసం ప్రత్యేక వందే భారత్ రైలు

ఐసిఎఫ్, జనవరి 27: జమ్ము కశ్మీర్ రాష్ట్ర శీతోష్ణస్థితులకు అనుకూలంగా ప్రత్యేక వందే భారత్ రైలు తయారు చేస్తున్నట్లు ఐసిఎఫ్ అధికారులు తెలిపారు. కొత్త వందే భారత్ రైలు తయారీ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయని, పనులు పూర్తికాగానే రైలును రైల్వే శాఖకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 27: రాష్ట్ర ప్రభుత్వ స్టార్టప్ టీఎన్ సంస్థలు ఆర్థిక సహాయాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ సంస్థలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోంది. ఔత్సాహికులు ఫిబ్రవరి 7వ తేదిలోపు www.startuptn.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, జనవరి 27: తూత్తుకుడి, తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులోని ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా 210 మెగావాట్లు, తూత్తుకుడి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని మూడో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా మరో 210 మెగావాట్లు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. కగా వేసవి అవసరాలకు 1,000 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

రెండు రోజులు పొడి వాతావరణం

ఐసిఎఫ్, జనవరి 27: రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో పొడి వాతావరణం ఉంటుందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిల్లోని కొన్ని ప్రాంతాల్లో వేకువజామున మంచు కురుస్తుందని, ఈనెల 28, 29 తేదీల్లో పొడి వాతావరణం, 30, ఫిబ్రవరి 1న దక్షిణ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో స్వల్ప వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

4న భ్రమరాంబా మల్లికార్జునుడి కల్యాణం

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం, కుచలాంబాళ్ చారిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన స్థానిక చెట్‌పేట్‌లో వున్న కుచలాంబాళ్ కల్యాణమహల్‌లో భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవం జరగనుంది. సాయంత్రం 6.15 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జనవరి 27: టీఎన్‌పీఎస్సీ సహా పలు పోటీపరీక్షల ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. టీఎన్‌పీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ సహా అన్ని రకాల పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. పాత వాషర్‌మెన్‌పేటలోని సర్ త్యాగరాజ కళాశాలలో 500 మందికి, చేపాక్కం రాజధాని కళాశాలలో 300 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు నెలల పాటు పనిదినాల్లో కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ నెల 1వ తేదీకి 18 ఏళ్ల పూర్తయి, టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 12వ తేది వరకు www.cecc.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు నెం.044-25954905, 28510537లలో సంప్రదించవచ్చు.

మునియాండి ఆలయ వేడుకల్లో భక్తులకు బిర్యానీ




ఆలయ ప్రాంగణంలో తయారవుతున్న బిర్యానీ, స్వామికి సమర్పించేందుకు ఫలపుష్పాలను తలపై మోసుకెళుతున్న భక్తులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని వడక్కంబట్టిలో అత్యంత ప్రాచీనమైన మునియాండి ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో భక్తులకు బిర్యానీని పంపిణీ చేశారు. దేశవిదేశాల్లో మునియాండి విలాస్ బ్రాండ్ బిర్యానీ హోటళ్లు నడిపే యజమానులంతా యేడాదికొకమారు ఈ ఆలయం వద్ద కలుసుకుని అందరూ చందాలు వేసుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులందరికీ వేడి బిర్యానీని అందిస్తారు. శుక్రవారం రాత్రి దేశవిదేశాల నుంచి వచ్చిన మునియాండి విలాస్ హోటళ్ల యజమానులంతా మునియాండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అందరూ కంకణాలు ధరించి వ్రతమాచరించారు. క్షీర కలశాలను శిరస్సుపై మోసుకెళ్లి స్వామివారి అభిషేకాలు జరిపారు. రాత్రి భక్తులంతా ఫలపుష్పాలు కలిగిన తట్టలను శిరస్సుపై పెట్టుకుని ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి వాటితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయం వద్దే 200 మేకలు, 300 కోళ్లను కోసి బిర్యానీ తయారు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే ఉన్న కరుప్పసామికి బిర్యానీని నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత భక్తులందరికీ వేడివేడి బిర్యానీ వడ్డించారు. ఈ వేడుకల్లో తమిళనాడు నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి మునియాండి హోటళ్ల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ బిర్యానీని తింటే వ్యాధులు దరిచేరవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో చాలా మంది బిర్యానీని పార్శిల్ కట్టుకుని ఇళ్లకు తీసుకెళ్లి కుటుంబ సభ్యుల చేత తినిపించారు.

'వెన్నెల పిల్ల'కి గ్రామస్తుల పూజలు



ఐసిఎఫ్, జనవరి 27: బాలికను 'వెన్నెల పిల్ల'గా భావించి గ్రామస్తులు పూజలు నిర్వహించారు. దిండుగల్ జిల్లా వేడచందూర్ సమీపంలో కోట్టూరులో యేటా తైపూసం రోజున బాలికను 'వెన్నల పిల్ల'గా భావించే వింత ఆచారం ఉంది. ఇందులో 8వ రోజైన తైపూసం రాత్రంతా మేల్కొని గ్రామంలోని ఓ బాలికను వెన్నెల పిల్లగా ఎంపిక చేస్తుంటారు. ఈ క్రమంలో గురువారం గ్రామస్తులు రాత్రంతా నిద్ర మేల్కొని, అదే గ్రామానికి చెందిన జయప్రకాశ్- సుధ దంపతుల కుమార్తె 11 ఏళ్ల యాళినిని 'వెన్నెల పిల్ల'గా ఎంపిక చేశారు. ఆ బాలికను తంగేడు పూలతో అలంకరించి, నెత్తిన అవే పూల బుట్ట పెట్టి గ్రామ సరిహద్దులో ఉన్న ఆలయ బావిలోకి వెళ్లే మార్గంలో దింపారు. అక్కడ గంపలో ఉన్న తంగేడు పూలు నీళ్లలో వేసి, మట్టి ప్రమిదల్లో నూనె పోసి వెలిగించి వెన్నెల పిల్ల సహా గ్రామస్తులు పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి గ్రామానికి తిరిగొచ్చారు. ఈ దీపం 7 రోజులు ఆరిపోకుండా వెలుగుతుందని, ఇలా చేయడం వల్ల కుటుంబాల్లో సంతోషం, గ్రామంలో పంటలు పండుతాయని, వర్షాలు బాగా కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం.

2న అవినాశి లింగేశ్వరాలయ కుంభాభిషేకం



కుంభాభిషేక పూజలకు సిద్ధపరచిన యాగ గుండాలు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశిలోని లింగేశ్వరాలయంలో ఫిబ్రవరి 2న కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కుంభాభిషేక పూజల కోసం ఆలయం 45 రోజులుగా యాగశాల నిర్మాణ పనులు కొనసాగాయి. లింగేశ్వరస్వామికి, అమ్మవారికి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నవగుండ యాగశాల, పాదిరి అమ్మన్, కాలభైరవ మూర్తులకు పంచ గుండ యాగశాల, 32 పరివార దేవతలకు చిన్న యాగగుండాలను ఆగమ విధుల ప్రకారం ఏర్పాటు చేశారు. ఈ యాగశాలల్లో ఈనెల 29నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఫిబ్రవరి 2న కుంభాభిషేకం ఘనంగా జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

మదురై ఎయిమ్స్ ఎక్కడ?

● సీపీఎం ఎంపీ వెంకటేశ్

పెరంబూర్, జనవరి 27: మదురై ఎయిమ్స్ ఎక్కడ? అంటూ మదురై సీపీఎం ఎంపీ వెంకటేశ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్'లో... మదురై ఎయిమ్స్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన శనివారంతో ఐదేళ్లు పూర్తి చేసుకుందన్నారు. రెండు ఇటుకలు తప్ప ఇప్పటివరకు ఒక్క కేంద్ర మంత్రి కూడా ఎయిమ్స్ ఆసుపత్రిని సందర్శించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ట్వీట్ చేశారు. కాగా, 2019 జనవరి 27న ప్రధాన మంత్రి మోదీ ఎయిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవం సంధ్భంగా పత్రికలు ముద్రించిన వార్తలను ఎంపీ తన ఎక్స్ పేజీలో ఉంచారు.

'ఖేలో ఇండియా' ప్రకటనల్లో ప్రధాని ఫొటో ఏదీ?

● బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

పెరంబూర్, జనవరి 27: ఖేలో ఇండియా ప్రకటనల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో చేర్చాలని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోవైలో శనివారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ... గ్రామీణ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రధాని మోదీ ఖేలో ఇండియా పోటీలు ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ పోటీల ప్రకటనల్లో కరుణ-స్టాలిన్-ఉదయనిధి ఫొటోలు మాత్రమే ఉండడం విడ్డూరంగా ఉందని, డీఎంకే కుటుంబ పాలనకు నిదర్శనమన్నారు. జాతీయస్థాయిలో జరుగుతున్న ఈ పోటీలకు రాజకీయం పులమకుండా, ప్రకటనల్లో ప్రధాని ఫొటో చేర్చాలని ఆమె కోరారు.

నేడు డీఎంకేతో కాంగ్రెస్ నేతల చర్చలు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో సీట్ల కేటాయింపుపై టీఎన్‌సీసీ నేతలు ఆదివారం డీఎంకే అధిష్ఠానంతో చర్చించనున్నారు. ఈ సారి కాంగ్రెస్‌కు ఏడు లోక్‌సభ నియోజకవర్గాలనే కేటాయించనున్నట్లు డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. ఈ సారి 9 స్థానాలను రాబట్టుకోవాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి ప్రయత్నాలు సాగించనున్నారు. ఈ దిశగా డీఎంకే ఎన్నికల సీట్ల కేటాయింపుల కమిటీ సభ్యులతో చర్చలు జరిపేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ కార్యకమిటీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి అజోయ్‌కుమార్ ఢిల్లీ నుంచి ఆదివారం ఉదయం చెన్నైకి విచ్చేయనున్నారు. ఈ ముగ్గురు నేతలు మీనంబాక్కం విమానాశ్రయం నుంచి నేరుగా రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయానికి చేరుకుంటారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు అళగిరి, సీఎల్పీ నేత సెల్వ పెరుంతగై, కాంగ్రెస్ కార్యకమిటీ సభ్యులు మాణిక్కం ఠాకూర్, చెల్లకుమార్, టీఎన్‌సీసీ మాజీ నేతలు తంగబాలు, ఈవీకేఎస్ ఇళంగోవన్, కృష్ణసామితో చర్చిస్తారు. సాయంత్రం 3 గంటలకు అన్నా అరివాలయంలో డీఎంకే ఎంపీ టీఆర్‌బాలు నాయకత్వంలోని సీట్ల కేటాయింపుల కమిటీతో భేటీ అవుతారు. లోక్‌సభ ఎన్నికల్లో తొమ్మిది నియోజకవర్గాలలో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోందని, ఆ మేరకు కాంగ్రెస్‌కు బలమున్న నియోజకవర్గాలను ఎంపికచేసి, ఆ వివరాలున్న జాబితాను కమిటీకి సమర్పించనుంది.

చర్చలకు కేంద్రబిందువుగా గవర్నర్ శైలి

● మాజీ మంత్రి చిదంబరం

అడయార్, జనవరి 27: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అనేక రకాలైన చర్చలకు కేంద్ర బిందువుగా ఎందుకు మారుతున్నారని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు పి.చిదంబరం ప్రశ్నించారు. ఇదే విషయంపై ఆయన శనివారం తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేస్తూ, 1897లో స్థాపించిన తొలి మూడు విశ్వవిద్యాలయాల్లో మద్రాస్ యూనివర్శిటీ ఒకటని గుర్తు చేశారు. అలాంటి విశ్వవిద్యాలయానికి గత ఐదు నెలలుగా ఉపకులపతి లేరన్నారు. గవర్నర్ - ప్రభుత్వం మధ్య తలెత్తిన పరిస్థితులు, గవర్నర్ వ్యవహారశైలే కారణంగా ఉన్నాయన్నారు.

ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పదోన్నతి కల్పించాలి

● టాస్మా నిరసన ర్యాలీ



ప్లకార్డులతో హెచ్‌ఎంల నిరసన ర్యాలీ

ప్యారీస్, జనవరి 27: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు సీనియారిటీ మేరకు పదోన్నతి కల్పించాలన్న డిమాండ్‌తో తమిళనాడు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం (టాస్మా) ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ జరిగింది. ఎగ్మూర్‌లోని రాజరత్తినం స్టేడియం నుంచి ఉదయం 10 గంటలకు సంఘ అధ్యక్షుడు సి.తంగమణి నేతృత్వంలో జరిగిన ర్యాలీకి పలు జిల్లాలకు చెందిన హెచ్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు అనంతరామన్, తిమ్మరాయన్, ధనలక్ష్మి, తామరైసెల్వన్, వరదరాజన్, శ్రీనివాసన్‌లు ర్యాలీకి ముందు పది డిమాండ్లపై ప్రసంగించారు. కనీస వేతనం రూ.36,900 పొందుతున్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రూ.56,900 పొందుతున్న ప్రధానోపాధ్యాయులను సమానంగా చూస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు పదోన్నతి కల్పించడం చట్టవిరుద్ధమన్నారు. 45 ఏళ్లుగా తమకు పదోన్నతి కల్పించలేదని అందువల్లే సచివాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టినట్లు తంగమణి తెలిపారు. ఈ ర్యాలీని ఎగ్మూర్ ఆల్బర్ట్ థియేటర్ వద్ద అడ్డుకున్న పోలీసులు, సంఘం తరపున ఐదుగురు ప్రధాన నిర్వాహకులను సచివాలయంలోని సీఎం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించేందుకు అనుమతించారు.

లిఫ్ట్‌లో చిక్కుకున్న 'ఖేలో ఇండియా' క్రీడాకారులు

పెరంబూర్, జనవరి 27: 'ఖేలో ఇండియా' పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పశ్చిమ బెంగాల్ క్రీడాకారులు లిఫ్ట్‌లో చిక్కుకున్నారు. 23 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు స్థానిక కోయంబేడులోని ఓ నక్షత్ర హోటల్‌లో బస చేస్తున్నారు. తొలి రౌండ్‌లో గెలిచిన వీరు, శనివారం జరుగనున్న రెండవ రౌండ్ పోటీల్లో పాల్గొనేందుకు 5వ అంతస్తులోని తమ గదుల నుంచి తొలుత 10 మంది లిఫ్ట్ ఎక్కారు. కానీ, లిఫ్ట్ మధ్యలో ఆగిపోవడం కలకలం రేపింది. లిఫ్ట్ సరిచేసేందుకు హోటల్ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రత్యేక యంత్రాల వద్ద లిఫ్ట్‌ను బద్దలుకొట్టి క్రీడాకారులను వెలుపలికి తీసుకొచ్చారు.

పాక్‌చెరలోని తమిళ జాలర్లను విడిపించండి

● కుటుంబీకుల డిమాండ్

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా పాకిస్థాన్ చెరలో ఉన్న ఆరుగురు జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని జాలర్ల కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నూరు సునామీ క్వార్టర్స్‌కు చెందిన జాలర్లు రాజన్, కరుణాకరన్, మురుగన్, బాలమురుగన్, అరుళ్‌దాస్, అశోక్ అనే ఆరుగురు జాలర్లు కాంట్రాక్టు పద్ధతిలో చేపలుపట్టే పనుల కోసం గుజరాత్‌కు గత డిసెంబర్ 18న వెళ్లారు. పోర్‌బందర్ నుంచి మరపడవల్లో చేపలు పట్టేందుకు వెళ్లి దారి తప్పి పాక్ సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. ఆ సమయంలో పాకిస్థాన్ నావికాదళం గస్తీ నౌకలో వచ్చి తమ దేశపు సముద్ర సరిహద్దుల్లోకి చొరబడ్డారంటూ ఆరుగురిని నిర్బంధించి తీసుకెళ్లింది. ఆ తర్వాత ఆ జాలర్లు పాక్ చెరలోనే గడుపుతున్నారని, వారి పరిస్థితి దయనీయంగా ఉందని కుటుంబీకులు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పాక్‌చెరలో ఉన్న జాలర్లను విడిపించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

కొత్తగా 4200 బస్సుల కొనుగోలుకు చర్యలు

● మంత్రి శివశంకర్

అడయార్, జనవరి 27: రాష్ట్ర రవాణా సంస్థకు కొత్తగా 4200 బస్సులను కొనుగోలు చేయనున్నట్టు రాష్ట్ర రవాణా శాఖామంత్రి శివశంకర్ తెలిపారు. దివంగత కలైంజర్ కరుణానిధి తల్లి అంజుగం 61వ స్మారక వేడుకలు తిరువారూరులో శనివారం జరిగాయి. కార్యక్రమంలో తరువాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం 1666 బస్సుల కొనుగోలు చేసేందుకు టెండర్లను ఆహ్వానించి, తొలిదశలో 100 బస్సులు కొనుగోలు చేశామన్నారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా డివిజన్లకు 200 కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు టెండర్లను ఆహ్వానించామన్నారు. మొత్తంమీద రవాణా శాఖకు 4200 బస్సులను కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. రవాణా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల ఏడో తేదీన చర్చలు జరుపనున్నట్టు వెల్లడించారు.

భూపతికోనలో దారి తప్పిన చెన్నై యువకులు

రక్షించిన ఏపీ పోలీసులు



సత్యవేడు, జనవరి 27: విహార యాత్ర కోసం వచ్చి దారి తప్పిన చెన్నైకి చెందిన యువకులను పోలీసులు రక్షించారు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా నాగలాపురం మండలం టీపీకోటలోని భూపతేశ్వర కోనకు ఆవడికి చెందిన ఐదుగురు మిత్రులు శుక్రవారం విహార యాత్రకు వచ్చారు. కోనలోకి వెళ్లా దారి తప్పినట్లు 100కి డయల్ చేశారు. ఎస్ఐ ఓబయ్య సిబ్బందితో అడవిలోకి వెళ్లి రాత్రి 1 గంట వరకు గాలించి దారి తప్పిన యువకులను రక్షించారు. దారి తప్పిన వారిలో నలుగురు యువకులతో పాటు ఓ యువతి ఉంది. వారిని సురక్షితంగా ఇంటికి పంపారు.

రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్ఐ

గూడూరు, జనవరి 27: తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో ఇద్దరు ప్రయాణికుల నుంచి రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ కొండప్పనాయుడు శనివారం తెలిపారు. జీఆర్పీ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన లోకనాథం, సాయికుమార్ బ్యాగులను తనిఖీ చేయగా రూ.1.50 కోట్లు విలువ చేసే రెండున్నర కిలోల బంగారం, రూ 10.40 లక్షల నగదు గుర్తించారు. సరైన ధృవీకరణ పత్రాలను చూపించకపోవడంతో బంగారం, నగదును సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

ఈడీ సోదాలంటూ రాత్రంతా వదంతులు

సిటీ పోలీసు కమిషనరేట్‌లో ఉద్రిక్తత

తలుపులన్నీ మూత, భద్రత పెంపు



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణకుగాను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు సోదాలు జరిపేందుకు వస్తున్నారంటూ వదంతులు వ్యాపించడంతో నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 9 గంటలవరకు ఆ కార్యాలయ తలుపులను మూసివేశారు. వందమందికిపైగా పోలీసులతో భద్రత పెంచారు. పోలీసు కమిషనరేట్‌లో ఈడీ అధికారులు గతంలో నమోదు చేసిన ఓ కేసులో అక్రమ నగదు బట్వాడాలు జరిగినట్లు ఆరోపణలు రావటంతో సోదారు నిర్వహించేందుకు ఈడీ అధికారులు వస్తున్నారంటూ వదంతులు వ్యాపించాయి. రాత్రి పదకొండు గంటల సమయంలో సాయుధ దళం పోలీసులు కమిషనర్ కార్యాలయం చుట్టూ భద్రతా విధులు చేపట్టారు. దీనితో ఆ మార్గంలో వెళుతున్న నగరవాసులంతా కమిషనర్ కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపును చూసి విస్తుపోయారు. శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కమిషనర్ కార్యాలయంలోకి గుర్తింపు కార్డులు కలిగిన ఉద్యోగులు, పోలీసులు, పోలీసు అధికారులను మాత్రమే అనుమతించారు.



అన్నమయ్య జిల్లా పీలేరులో శనివారం యువగళం మొదటి వార్షికోత్సవం సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కేక్ కట్ చేసి యువగళం పాదయాత్రలో లోకేష్ వెన్నంటి నడిచిన చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు తినిపిస్తున్న దృశ్యం

తిరుప్పూర్, తిరువళ్లూర్ ఎస్పీలు సహా 11 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

పెరంబూర్, జనవరి 27: తిరుప్పూర్, తిరువళ్లూర్ జిల్లా ఎస్పీలు సహా 11 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

- తిరుప్పూర్ ఎస్పీ స్వామినాథన్, చెన్నై అవినీతి నిరోధక శాఖ ఎస్పీగా నియమితులయ్యారు.
- తిరువళ్లూర్ ఎస్పీ పాకెర్ల కల్యాణ్, చెన్నై దక్షిణ మండల ఆర్థిక నేర విభాగ ఎస్పీగా నియమితులయ్యారు.
- తిరువళ్లూర్ ఎస్పీగా శ్రీనివాస పెరుమాళ్ నియమితులయ్యారు.
- తిరుప్పూర్ నగర శాంతి భద్రతల విభాగం డిప్యూటీ కమిషనర్‌గా కోయంబత్తూర్ డిప్యూటీ కమిషనర్ ఎం.నాగరాజన్
- మదురై డిప్యూటీ కమిషనర్ అనిత తిరునల్వేలి డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ.
- తిరుప్పూర్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న అభిషేక్ గుప్తా... తిరుప్పూర్ ఎస్పీగా బదిలీ.
- చెన్నై కొళత్తూర్ డిప్యూటీ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి పాండ్యరాజన్ నియామకం.
- చెన్నై ఉత్తర అవినీతి నిరోధక విభాగం ఎస్పీగా వి.శరవణకుమార్, చెన్నై సీఐడీ ఎస్పీగా ఎస్.శక్తివేల్, కేంద్ర విజిలెన్స్ విభాగం ఎస్పీగా వి.శ్యామల దేవిని బదిలీ చేశారు.

ట్రిప్లికేన్ హైరోడ్డులో కారు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ హైరోడ్డులో శనివారం ఉదయం వేగంగా వెళుతున్న కారు ఉన్నట్టుండి నిప్పుమంటల్లో దగ్ధమైంది. ఆ కారులో మంటలు చెలరేగడం చూసి అందులో ప్రయాణిస్తున్న వారంతా కిందకు దిగి పరుగులు తీశారు. కాసేపటికల్లా ఆ కారు అంతటా నిప్పుమంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకుని ట్రిప్లికేన్ అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆ కారు దగ్ధమైంది. ఈ సంఘటనపై ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు డీపీఐ కార్యకర్తల మృతి

● 24 మందికి గాయాలు

ప్యారీస్, జనవరి 27: అరియలూరు జిల్లా వెప్పూర్ సమీపంలో వ్యాన్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు డీపీఐ కార్యకర్తలు మృత్యువాతపడగా, మరో 24 మందికి గాయాలయ్యాయి. తిరుచ్చిలో శుక్రవారం సాయంత్రం జరిగిన డీపీఐ మహానాడులో పాల్గొని ఇంటికి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని విలియనూరుకు చెందిన 30మంది డీపీఐ కార్యకర్తలు మహానాడులో పాల్గొని వ్యాన్‌లో అర్ధరాత్రి తిరుగుముఖం పట్టారు. వారు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను శనివారం తెల్లవారుజామున వెప్పూర్ సమీపంలో నారయూర్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఉత్తరకుమార్, యువరాజ్, పూసెల్వన్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించారు. మరో 24 మంది కార్యకర్తలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌లో చిక్కుకున్న కార్యకర్తలను వెలికి తీసి విరుదాచలం, తొపూర్ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. కాగా, ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటన విడుదల చేశారు.

రాజీవ్ హత్యకేసులో విడుదలైన శాంతన్

ఆసుపత్రిలో చేరిక

ప్యారీస్, జనవరి 27: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో జైలు నుంచి విడుదలైన శాంతన్ అనారోగ్యం కారణంగా సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చేరారు. రాజీవ్ హత్య కేసులో యావజ్జీవశిక్ష అనుభవించిన శాంతన్‌ను 2022లో సుప్రీంకోర్టు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీలంకకు చెందిన ఆయన తిరుచ్చిలోని ప్రత్యేక శరణార్థుల శిబిరంలో ఉంటూ పచ్చకామెర్లతో బాధపడ్డారు. దీంతో శిబిరం అధికారులు ఆయన్ను రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

కచ్చాదీవి వెళ్లేందుకు యత్నించిన 50 మంది అరెస్ట్

ప్యారీస్, జనవరి 27: అనుమతి లేకుండా కచ్చాదీవికి వెళ్లేందుకు యత్నించిన హిందూ సంఘాలకు చెందిన 50 మందిని అరెస్ట్ చేశారు. శ్రీలంక ఆధీనంలో ఉన్న కచ్చాదీవిని విడిపించాలన్న కోరిక రోజురోజుకు బలపడుతూ వస్తోంది. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ దీవిలో జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు హిందూ సంస్థలు ప్రకటించాయి. ఆ మేరకు ఆలిండియా హిందూ సత్యసేన వ్యవస్థాపకుడు వసంత్‌కుమార్, హిందూ మక్కల్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఇళయరాజా, కాషాయ పులిపడై అధ్యక్షుడు సిటీ బోస్ నేతృత్వంలో 50మందికి పైగా కార్యకర్తలు రామనాథపురం జిల్లా రామేశ్వరం అగ్నితీర్థం సముద్రతీరం నుంచి పడవలో కచ్చాదీవికి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

● భార్య మృతివార్త విని వృద్ధుడి మృతి

చెన్నై,జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు సమీపం అయనంబాక్కంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య మృతి చెందినట్లు తెలుసుకున్న భర్త కుప్పకూలి మృతిచెందారు. వృద్ధాప్యంలో ఉన్న ఆదంపతులు ఒకేసమయంలో మృత్యువాత పడటం స్థానికులకు కంటతడి పెట్టించింది. అయనంబాక్కం రాజా వీధిలో రాజా(60), మల్లికా(50) దంపతులు నివసిస్తున్నారు. కొద్ది రోజులకు ముందు మల్లిక తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం రాత్రి ఆమె చికిత్స ఫలించక మృతి చెందారు. ఈ వార్త విన్నవెంటనే రాజా దిగ్భ్రాంతికి గురై నేలపై పడ్డాడు. వెంటనే కుటుంబీకులు ఆయన్ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. దీనితో మృత్యువులోనూ వీడని ఆ వృద్ధ దంపతుల భౌతికకాయాలపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ స్థానికులు బోరున విలపించారు.

చరిత్ర తెలియని అన్నామలై

● మండిపడ్డ అన్నాడీఎంకే నేత కేపీ మునుస్వామి

పెరంబూర్, జనవరి 27: రాజకీయ చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్న అన్నామలైను ప్రధాని నరేంద్రమోదీ నియంత్రించాలని అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి డిమాండ్ చేశారు. కృష్ణగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని అన్నామలై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉత్తరాదికే పరిమితమైన బీజేపీని, 1998 పార్లమెంటు ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ఆహ్వానించి ఎన్డీఏ కూటమి ఏర్పాటుచేసింది జయలలిత అన్నారు. అప్పుడు అన్నామలై విద్యార్థిగా ఉండేవారని, కానీ ప్రస్తుతం ఎన్డీఏ కూటమి తాము ఏర్పాటు చేసినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 1న ఆందోళనలో చేపడుతున్నామని తెలిపారు.

ఆ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు

● రజనీకాంత్
● మేమూ మనుషులమే : ఐశ్వర్య రజనీకాంత్

తన 'జైలర్' చిత్రం ఆడియో రిలీజ్ ఈవెంట్‌లో 'అర్థమైందా రాజా' అంటూ తాను చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని సూపర్‌స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించారు. తన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన 'లాల్ సలామ్' ఆడియో రిలీజ్ వేడుక శుక్రవారం రాత్రి చెన్నైలో జరిగింది. విష్ణు విశాల్, విదార్థ్ హీరోలుగా నటించగా, రజనీకాంత్ అతిథి పాత్రను పోషించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. లైకా ప్రొడక్షన్స్ బ్యానరుపై సుభాస్కరన్ నిర్మించారు. ఆడియో విడుదల వేడుకలో దర్శకురాలు ఐశ్వర్య మాట్లాడుతూ... 'గత కొంతకాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నా. ఆన్‌లైన్ నెగిటివిటీ గురించి నా టీం సభ్యులు చెబుతున్నారు. వాటివల్ల ఆగ్రహానికి గురైన పలు సందర్భాలున్నాయి. మేమూ మనుషులమే. మాకూ భావోద్వేగాలుంటాయి. ఇటీవల నా తండ్రిని 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చే వారిని అలా పిలుస్తారని తెలుసుకున్నా. రజనీకాంత్ సంఘీ కాదు. అలా అయితే, ఈ చిత్రంలో ఆయన నటించేవారుకాదు' అని అన్నారు. తన కుమార్తె వ్యాఖ్యలతో రజనీకాంత్ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'జైలర్ ఈవెంట్‌లో 'అర్థమైందా రాజా' అంటూ నేను కామెంట్ చేశాను. వాటిని కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. హీరో విజయ్‌పై పరోక్షంగా మాటల దాడి చేసినట్టు అన్వయించుకున్నారు. అవి నన్నెంతో బాధించాయి. విజయ్ నా కళ్ళముందు పెరిగాడు. ప్రతిభ, పట్టుదలతో ఉన్నతస్థాయికి చేరుకున్నాడు. నాకు, అతనికి పోలిక పెట్టొద్దు. అది మా ఇద్దరి గౌరవ మర్యాదలకు మంచిదికాదు. నాకు నేనే పోటీ. నా అభిమానులకు చెప్పేది ఒక్కటే. మమ్మల్ని పోల్చి చూడొద్దు. 'లాల్ సలామ్' కథ వినగానే నటించాలని నిర్ణయం తీసుకున్నాను. సినిమాను చూసిన సంగీత దర్శకుడు రెహ్మాన్.. ఐశ్వర్యను మెచ్చుకున్నారు. సినిమా తప్పకుండా సక్సెస్ సాధిస్తుంది' అని అన్నారు. కాగా రజనీ తన ప్రసంగంలో 'కాకి గద్ద' వివాదానికి తెరదించే ప్రయత్నం చేశారు.


రెహ్మాన్, రజనీకాంత్, సుభాస్కరన్


ఆడియో రిలీజ్ దృశ్యం

మహిళా భద్రత ఇతివృత్తంతో 'ఇనిమే నాంగదా హెడ్‌లైన్స్'

● అతిథి పాత్రలో షకీలా

సాయిప్రభ మీనా, రాజ్ మిత్రన్, సంగీత, కీర్తనా తదితరులు నటించిన చిత్రం 'ఇనిమే నాంగదా హెడ్‌లైన్స్'. మహిళల భద్రతను ప్రధానాంశంగా చేసుకుని తెరకెక్కించారు. ఇందులో అతిథిపాత్రలో సీనియర్ నటి షకీలా నటించారు. హీరోగా నటించిన సాయిప్రభ మీనా దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. 'సమాజంలో మహిళలపై జరిగే ఘోరాలను వివరిస్తూ, వారి రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, లోతైన భావోద్వేగాలతో ఈ సినిమాను తెరకెక్కించా. ఇండస్ట్రీలో చిన్నాపెద్దా సినిమా అనే తేడా లేదు. ఎలాన్ మస్క్‌ను ఈ ప్రపంచం తింగరోడు అనే ముద్ర వేసింది. కానీ, నేడు ప్రపంచంలోనే గొప్పవ్యక్తి. యువత శ్రమిస్తే సినిమాలో విజయాలు ఖాయం' అన్నారు. నటి షకీలా మాట్లాడుతూ... 'ఈ సినిమా యూనిట్‌తో కలిసి కొన్ని రోజులు మాత్రమే పనిచేశా. అయినప్పటికీ నాకు మంచి పాత్ర ఇచ్చారు. నలుగురు మహిళలు ఎలాంటి మేకప్ లేకుండా సహజంగా నటించారు. ప్రతి ఒక్కరూ చిన్న దర్శకుడు, చిన్న నటుడు స్థాయి నుంచే పెద్ద దర్శకుడు, స్టార్‌గా ఎదుగుతారు. దీనికంతటికి కారణం విజయమే' అని అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'అధోముగం'

రీల్ పెట్టి, తరిగో ఫిల్మ్ వర్క్స్ సంయుక్తంగా సస్పెన్స్ థ్రిల్లర్ కోణంలో నిర్మించిన చిత్రం 'అధోముగం'. దీనికి అర్థం దాగి ఉన్న ముఖం. మనుషుల్లో దాగిఉన్న వింత ముఖాలు ఒక్కోసారి బహిర్గతమైతే ఎలాంటి వింతలు, ప్రమాదాలు, కష్టాలు ఎదురవుతాయన్న కోణంలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఊటీ, కున్నూరు, పరిసర ప్రాంతాల నేపథ్యంలో స్క్రీన్‌ప్లే సాగుతుంది. పర్వత ప్రాంతాలు, చలి, పొగమంచు, అధునాతన సాంకేతిక వంటి అంశాలను జోడించి ప్రేక్షకుడిని అమితాసక్తికి గురిచేసేలా తెరకెక్కించారు. సినిమా గురించి దర్శకుడు సునీల్‌దేవ్ మాట్లాడుతూ.. 'హీరోకు తెలియకుండానే ఆయన భార్య మొబైల్ ఫోనులో ఒక స్పై అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేయడంతో అతని జీవితం తలకిందులు మారిపోతుంది. దీని చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ఎన్నో ట్విస్టులతో స్క్రీన్‌ప్లేను రూపొందించాం. హీరోహీరోయిన్లుగా సిద్ధార్థ్ ఎస్‌బీ, చైతన్య నటించారు. వీరితోపాటు అనంత్‌నాగ్, సరిత్రన్, వర్గీస్ తదితరులు నటించారు. సీనియర్ నటుడు అరుణ్‌పాండ్యన్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. అరుణ్‌విజయ్ చాయాగ్రహణం సమకూర్చగా, నేపథ్య సంగీతం శరణ్ రాఘవన్, సంగీతం మణికంఠన్ మురళి అందించారు' అని వివరించారు.


'అధోముగం'లో సిద్ధార్థ్ - చైతన్య

చాలెంజింగ్ పాత్రల్లో మెప్పిస్తున్న లిజీ ఆంటోని

చిత్రజ్యోతి



ఇటీవల తమిళ చిత్రపరిశ్రమలో భారీ విజయాలను సాధించిన చిత్రాల్లో కీలక పాత్రలను పోషించిన నటి లిజీ ఆంటోని వరుస హిట్లతో ప్రశంసలు అందుకుంటూ, చాలెంజింగ్ పాత్రల్లో మెప్పిస్తున్నారు. కోలీవుడ్‌లోకి అడుగుపెట్టి దశాబ్దకాలం పూర్తి చేసుకున్న ఆమె... తను పోషించే ప్రతి పాత్రలో సహజత్వం ఉట్టిపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా విడుదలైన 'బ్లూస్టార్' లోనూ తల్లిపాత్రలో మెప్పించారు. రామ్ దర్శకత్వం వహించిన 'తంగ మీన్‌గళ్' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన లిజీ... తన మొదటి చిత్రంలోనే మంచి పేరుతో పాటు గుర్తింపు దక్కించుకున్నారు. ఆ తర్వాత విభిన్నమైన పాత్రలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. 'తరమణి', 'పరియేరుం పెరుమాళ్' చిత్రాల్లో లిజీ నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఓటీటీలో విడుదలైన 'రాంగీ' చిత్రం ఆమె నటనలోని మరో కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. పలువురు నటీమణులు నటించేందుకు వెనుకంజ వేసే చాలెంజ్‌తో కూడిన పాత్రలను సైతం ఆమె నటిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. రైటర్, 'సానికాయితం', 'నక్షత్రం నగర్‌గిరదు', 'గట్టాకుస్తీ' వంటి వరుస హిట్ చిత్రాల్లో లిజీ నటించి, తమిళ సినిమాలోని అత్యుత్తమ నటీమణుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.



ఉడన్‌కుడిలో పట్టుబడిన తెలుపురంగు గుడ్లగూబ


పట్టుబడిన గుడ్లగూబను చూపుతున్న విజయన్

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఉడన్‌కుడి వద్ద అరుదైన తెలుపురంగు గుడ్లగూబ పట్టుబడింది. ఉడన్‌కుడి సమీపం చిల్లూరులో ఆ తెల్లని గుడ్లగూబను కాకులు తరుముకు వచ్చాయి. చివరకు ఆ గుడ్లగూబ విజయన్ అనే వ్యక్తి ఇంటి పైకప్పుపై పడింది. గమనించిన విజయన్ కాకుల బారి నుంచి దాన్ని కాపాడాడు. అతడి సోదరుడు జయరాజ్ ఆ గుడ్లగూబను వీడియో తీసి సోషల్ మీడియాలో వెలువరించారు. దీనితో అటవీ శాఖ అధికారులు ఆ వీడియోను చూసి వెంటనే విజయన్ ఇంటికి వెళ్లి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ గుడ్లగూబ అరుదైన జాతికి చెందినదని, పగటిపూట దానికి కళ్లు కనపడవని, కనుకనే కాకులు తరుముకుంటూ వచ్చాయని, అయితే రాత్రిపూట దానికి కళ్ళు బాగా కనబడటమే గాకుండా పక్షులను తరిమికొడుతుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

మోపెడ్ తయారు చేసిన టెన్త్ విద్యార్థి


మోపెడ్‌తో విద్యార్థి సుల్తాన్ అబ్దుల్ ఖాదర్

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కాయల్‌పట్టినం కుత్తుకల్ ప్రాంతానికి చెందిన సుల్తాన్ అబ్దుల్‌ఖాదర్ (16) టెన్త్ చదువుతున్నాడు. చిన్నప్పటి నుండి ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీపై ఆసక్తి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తనకిచ్చిన ఉచిత సైకిల్‌కు బ్యాటరీ, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అమర్చి మోపెడ్‌గా మార్చాడు. ప్రస్తుతం బటన్ నొక్కితే ఆ సైకిలు రివ్వున దూసుకెళుతుంది. రెండు గంటలపాటు ఈ సైకిల్ బ్యాటరీని చార్జి చేసుకుంటే 14 కి.మీల దూరం వరకు వెళ్లవచ్చునని అబ్దుల్ తెలిపాడు. బ్యాటరీ చార్జి తగ్గితే పెడల్ ద్వారా ఈ సైకిలును నడపవచ్చునని పేర్కొన్నారు. మోపెడ్‌ను చూసి గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసలతో ముంచెత్తారు.

ఇండియా కూటమిలో స్టాలిన్ మాత్రమే ఉంటారు

● టీటీవీ దినకరన్



ప్యారీస్, జనవరి 27: ఇండియా కూటమిలో భిన్నాభిప్రాయాలు కలిగిన నేతలు ఉన్నందువల్ల, ఆ కూటమిలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ మాత్రమే ఉంటారని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ వ్యాఖ్యానించారు. విల్లుపురం జిల్లా దిండివనంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జాతీయస్థాయిలో ఏర్పాటైన ఇండియా కూటమి నుంచి ఒక్కొక్క పార్టీ వైదొలుగుతోందని, ఎన్నికల సమయానికి ఆ కూటమిలో ఉండబోయేది ఎంకే స్టాలిన్ మాత్రమే అని అన్నారు. నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్ హత్య కేసులో లభ్యమైన ఆధారాలకు అనుగుణంగా పోలీసులు సమర్థవంతంగా విచారణ జరుపుతున్నారని, ఇందులో దోషులకు జైలుశిక్ష తప్పదన్నారు. ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఉన్న అన్నాడీఎంకేతో తమ పార్టీ ఎప్పటికీ చేతులు కలపబోదని, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని దినకరన్ తెలిపారు.

పేకాటలాంటిదే...

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఎద్దేవా



ప్యారీస్, జనవరి 27: ఇండియా కూటమి పేకాటలాంటిదని, ఒక్కో రౌండ్‌కి ఒక జోకర్ బయటకు వెళుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఎద్దేవా చేశారు. కడలూరు జిల్లా బన్రూట్టిలో 'ఎన్ మన్.. ఎన్ మక్కల్' పాదయాత్రలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికల హామీల్లో 99 శాతం నెరవేర్చినట్లు చెబుతున్నారని, అయితే కడలూరు జిల్లాలో తాను పర్యటించిన ప్రాంతాల్లో ఒక్క అభివృద్ధి పథకం కూడా అమలు జరగలేదని స్థానికులు తన వద్ద మొరపెట్టుకున్నారని తెలిపారు. గత తొమ్మిదేళ్లలో రూ.10.96 లక్షల కోట్ల నిధులను రాష్ట్రానికి కేంద్రం అందజేసిందని, అయితే ఈ నిధులు డీఎంకే పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి సంతకం టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేసి కల్లు దుకాణాలు ప్రారంభిస్తామన్నారు. పేక ముక్కల్లాంటి ఇండియా కూటమిలో మమతాబెనర్జీ, నితీశ్‌కుమార్ వంటి నాయకులు బయటకు వచ్చారని, మరికొన్ని రోజుల్లో మిగతా వారు కూడా వైదొలిగే అవకాశముందని అన్నామలై తెలిపారు.


ముదుమలై పులుల అభయారణ్యంలో గుంపుగా ఉన్న రాబందులు




సత్యమంగళం పులుల అభయారణ్యంలో సంచరిస్తున్న రాబందులు - ప్లకార్డులతో ప్రదర్శన జరుపుతున్న విద్యార్థినులు

రాష్ట్రంలో 320కి పెరిగిన రాబందుల సంఖ్య

● ఆసక్తికరంగా సాగిన గణన


చెన్నై, జనవరి27 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లలో రాష్ట్రంలో రాబందుల సంఖ్య 320కి పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 25 నుంచి ఈ ఏడాది జనవరి 25 వరకు నిర్వహించిన రాబందుల గణనలో వాటి సంఖ్యను 246గా లెక్కకట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ముదుమలై, సత్యమంగం, వయనాడు, బందపూరు,కర్ణాటకలోని నాగర్‌హోల్ తదితర ప్రాంతాల్లో పాఠశాలల విద్యార్థుల చేత నిర్వహించిన రాబందుల గణన ఆసక్తికరంగా సాగిందని తెలిపారు. తాజా లెక్కల ప్రకారం మదుమలైలో78, సత్యమంగళం పులుల అభయారణ్యంలో70, తిరునల్వేలి అటవీ ప్రాంతంలో నాలుగు చొప్పున రాబందులు సంచరిస్తున్నాయని తెలిపారు. ఈ గణనను విజయవంతంగా పూర్తి చేసిన చిన్నారులు ప్లకార్డులు పట్టుకుని ప్రచారం కూడా నిర్వహించారని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

కేసరి స్కూలుకు క్రీడా సామగ్రి వితరణ


కార్యక్రమంలో ప్రముఖులు

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ నిర్వాహకులు క్రీడా సామాగ్రిని వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా చెన్నై లయన్స్ క్లబ్ మద్రాస్ ప్రెసిడెన్సీ అధ్యక్షుడు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ మనోహర్, లయన్స్ క్లబ్ బాబు, ప్రముఖ ఆర్కిటెక్ మాదాల ఆదిశేషయ్య, పాఠశాల పూర్వ విద్యార్థి గుండపనేని సుబ్రమణ్యం, రాధారాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నిర్వాహకులు రూ.20 వేల వ్యయం చేసే క్రీడా సామాగ్రిని పాఠశాలకు అందించారు.

వేలూరు సమీపంలో పుట్టగొడుగు పెనుశిల


శివనాథపురంలో కనువిందు చేస్తున్న పుట్టగొడుగు పెనుశిల

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా శివనాథపురం వద్ద అరుదైన వింతగొలిపే పుట్టగొడుగు బం డరాయిని కనుగొన్నారు. ఈ పెనుశిల ప్రస్తుతం స్థానికులకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇజ్రాయేల్‌లోని నెకెవ్‌డిమ్నా పార్కులోనే ఈ పుట్టగొడుగు పెనుశిలలు (పెద్ద బండరాళ్లు) అధికంగా ఉన్నాయి. ఈ రకంగా పుట్టగొడుగు బండరాళ్ళు థార్ ఎడారిలో కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కృష్ణగిరి జిల్లా సరిహద్దులో తిరుపత్తూరు జిల్లా కత్తిలి సమీపం తోక్కియం గ్రామం కదిరియప్పన్ కోవిల్ ప్రాంతం వద్ద ఈ రకం పెనుశిలను కనుగొన్నారు. తాజాగా వేలూరు జిల్లా శివనాథపురంలో పుట్టగొడుగు బండరాయిని కనుగొన్నారు. పచ్చటి చెట్ల నడుమనున్న ఆ బండరాయిని స్థానికులకు, చుట్టుపక్కలి గ్రామస్థులకు టూరిస్ట్ పాయింట్‌గా మారింది.

గిన్నిస్ రికార్డు నమోదు చేసిన మిడిల్ మిస్ట్


రికార్డు స్వీకరిస్తున్న నిర్వాహకులు

అడయార్, జనవరి 27: కేటీఎం జ్యువెలరీకి చెందిన విశిష్టమైన డైమండ్ సెంట్రిక్ యూనిట్ ఓషన్ సఫైర్ కళాత్మక ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ఓషన్ సఫైర్ అపరిమితమైన సృజనాత్మకత, నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఇది రూపొందించిన మిడిల్ మిస్ట్ ఏడు విభిన్న భాగాల కలయిక, ప్రకృతి వైభవానికి ప్రతిరూపంగా నిలవడమే కాకుండా, గిన్నిస్ రికార్డును నమోదు చేసింది. మిడిల్ మిస్ట్ ఆభరణాలపై అత్యధిక సంఖ్యలో వజ్రాలను కలిగి ఉన్నందుకు ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డులో తన స్థానాన్ని సంపాదించుకుంది. ఈ ఆభరణం గురించి కేటీఎం జ్యువెలరీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ అమ్మాసి స్పందిస్తూ, ఈ కళాఖండాన్ని 21 మంది కళాకారులు 1860 గంటల పాటు శ్రమించి రూపొందించారని పేర్కొన్నారు. కాగా, ఈ కేటీఎం జ్యువెలరీ లిమిటెడ్... చెన్నై సిల్క్స్, శ్రీ కుమరన్ తంగమాళిగై, టీమేజ్ ప్రీకాస్ట్, ఎస్‌సీఎం గార్మెంట్స్ తదితర కంపెనీల అనుబంధ కంపెనీల్లో ఒకటిగా ఉంది.

విజయవంతంగా అలెన్ థర్డ్ ఎడిషన్ 'సోపాన్'

● విద్యార్థులకు సన్మానం

అడయార్, జనవరి 27: అలెన్ కెరీర్ ఇనిస్టిట్యూట్ చెన్నై ఆధ్వర్యంలో వార్షిక సన్మాన కార్యక్రమం 'సోపాన్' మూడో ఎడిషన్, ఆరో వార్షిక మెంటరింగ్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించింది. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో ఉదయం ఐఐటీ, జేఈఈ, నీట్ (యూజీ), ఒలంపియాడ్ వంటి పోటీ పరీక్షల్లో జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సన్మానించారు. మధ్యాహ్నం సెషన్‌లో 2023 నీట్ యూజీ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ మోహన్ డయాబెటీస్ స్పెషాలిటీ సెంటర్ అధినేత పద్మశ్రీ డాక్టర్ మోహన్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ (రిటైర్డ్) ఏడీ మోహన్‌రాజ్, ఆవడి పోలీస్ కమిషనర్ కె.శంకర్, ఆదాయ పన్ను విభాగం కమిషనర్ వి.నందకుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అమూల్యమైన సూచనలు ఇవ్వగా అలెన్ సౌత్ ఇండియా జోనల్ హెడ్ మహేష్ యాదవ్, ప్రముఖ కెరీర్ కౌన్సెలర్ డాక్టర్ హరీష్ శర్మ, అలెన్ జలంధర్ ఎస్‌ఐటీ హెడ్ సంతోష్ సింగ్ పాల్గొన్నారు. ఈ రెండు సెషన్‌లలో 624 మంది విద్యార్థులను సన్మానించి, రూ.2.70 లక్షల మేరకు నగదు బహుమతిని కూడా అందజేశారు.

'సోపాన్'లో పాల్గొన్న విద్యార్థులు



ఆళ్వారుపేటలో చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వారుపేట,టీటీకే రోడ్డులో ఉన్న శ్రీ శంకరా హాలులో 'క్రాఫ్ట్ గార్డెన్' పేరుతో హస్తకళా వస్తు ప్రదర్శన ఏర్పాటైంది.హస్తకళాకారుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఈ ప్రదర్శన ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. సందర్శకులు ఈ ప్రదర్శనను ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంట లవరకు సందర్శించవచ్చు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులు చోటు చేసుకున్నాయి. ఇందులో కోల్‌కతా, బెంగాల్ కాటన్, ఢకై జందాని, కాంతా వర్క్, లినెన్, రా శిల్క్, బటిక్ సాఫ్ట్ కాటన్, ముషీరాబాద్ సిల్క్, ఒడిశా ఇక్కత్, కశ్మీర్, హైదరాబాద్ కాటన్ చీరలు, చెన్నపట్నం బొమ్మలు, మురదాబాద్ బ్రాస్ ఆర్టికల్స్, జోథ్‌పూర్ ఉడెన్ వస్తువులు, గుజరాత్ హ్యాండ్‌బ్లాక్ ప్రింట్ డ్రెస్ కర్టెన్లు, బెడ్‌షీట్లు, కుషన్లు,గుజరాత్ హ్యాండ్ బ్యాగులు, డోర్ కర్టెన్లు, గిఫ్ట్ బాక్సులు, ఒడిశా, తంజావూర్, రాజస్థాన్ పెయింటింగ్‌లు, పంచలోహ జ్యువెలరీ వస్తువులు, కశ్మీర్ శాలువలు తదితరాలన్నీ చోటు చేసుకున్నాయి.

కార్పొరేట్ క్రికెట్ టోర్నీ సీజన్-2 ప్రారంభం


క్రికెటర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

అడయార్, జనవరి 27: రోటరీ క్లబ్ సహకారంలో నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన ప్రశాంత్ హాస్పిటల్ కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్‌ను తాజాగా ప్రారంభించింది. గుడ్ కార్డియాక్ హెల్త్‌ను ప్రమోట్ చేయడానికి ఈ టోర్నీని సీసీటీ 2024 పేరుతో నిర్వహిస్తోంది. ఈ సీజన్‌లో విజేతలుగా నిలిచే జట్టుకు రూ.50 వేలు, రన్నర్ ఎకు రూ.25 వేలు అందజేయనున్నారు. ఈ టోర్నీ ద్వారా వసూలయ్యే మొత్తాన్ని రోటరీ క్లబ్‌కు చారిటీస్ అందజేస్తారు. టోర్నీ ప్రారంభోత్సవంలో గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్, ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కృష్ణ, సీఈవో డాక్టర్ భాస్కరన్, రోటరీ క్లబ్ రొటేరియన్ ఏకేఎస్ రవివర్మన్, ఎం.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బొటనవేలి ముద్రణతో జాతీయ జెండా



రూపొందించిన జాతీయ జెండాతో జాడిత్‌కిప్టి

పెరంబూర్, జనవరి 27: వేలి ముద్రలతో జాతీయజెండా రూపొందించిన బాలికను పలువురు అభినందించారు. మైలాడుదురై జిల్లా శీర్గాళిల తౌన్‌బాదికి చెందిన జాకబ్ జ్ఞానసెల్వన్, ఎస్తా దంపతుల కుమార్తె జాడిత్‌కిప్టి అదే ప్రాంతంలోని పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి ఉన్న జాడిత్‌కిప్టి, 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వినూత్న ప్రక్రియగా 6 అడుగుల వెడల్పు, 4 అడుగుల పొడవున తెల్లటి గుడ్డపై కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులను తీర్చి దిద్దింది. ఇందుకోసం ఆయా రంగుల్లో 7,500 సార్లు తన వేలిముద్రను ఉంచి, గుడ్డపై జాతీయ పతాకం రూపొందించింది.